

# 5. బతుకమ్మ పండుగ

**పాఠంలోకి ప్రవేశించేముందు:**



- ఈ దృశ్యాన్ని గుర్తుపట్టారా?
- ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందిన తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక.
- గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోనికి ఎక్కిన ఈ మహా బతుకమ్మ గురించిన వివరాలు వార్తా పత్రిక, అంతర్జాలం నుండి సేకరించి నివేదిక రాయండి. శీర్షిక పెట్టండి.
- ఇప్పుడు ఈ పండుగ సంబరాల గురించి పాఠం ద్వారా తెలుసుకుందాం.

అనేక సంస్కృతులకు, ఆచార వ్యవహారాలకు నిలయం భారతదేశం. మనం జరుపుకునే పండుగలు ఈ రకరకాల సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతాయి. వీటిని ఆయా రాష్ట్రాల ప్రజలు వారివారి సంప్రదాయాలకు అనుగుణంగా కొద్దిపాటి తేడాలతో జరుపుకుంటారు.

'బ్రతుకు-బ్రతికించు' అన్నదే ఈ బతుకమ్మ పండుగ అర్థం.

తెలంగాణాలో 'బొడ్డెమ్మ, బతుకమ్మ' పేర్లతో ఈ పండుగను జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని మహర్నవమి వరకు తొమ్మిది రోజులు ఈ పండుగను చేసుకొనుట పరిపాటి.

దీనికి ముందు తొమ్మిది రోజులు 'బొడ్డెమ్మ' పండుగను జరుపుకొంటారు. బొడ్డెమ్మ పండుగ పిల్లలు చేసుకొనే పండుగ. పిల్లలందరూ ఈ పండుగలో పాల్గొని ఆడుకొంటుంటే పెద్దలు చూసి ఆనందిస్తారు.

బొడ్డెమ్మ పండుగ పూర్తియైన మరునాడు ఆశ్వయుజ పాడ్యమితో 'బతుకమ్మ పండుగ' ప్రారంభమవుతుంది.

ఈ కాలంలో పల్లెపట్టులు పచ్చనిపైరు పంటలతో కనువిందు చేస్తూ ఉంటాయి. ప్రకృతి నుండి సేకరించిన పూలను ఉపయోగించి దేవతగా సిద్ధం చేసే బతుకమ్మ ఆరాధన విశిష్టమైంది.

బతుకమ్మ పండుగ రోజు వెదురు బద్దలతోగాని, దుసేరు అనే ఒక రకమైన తీగతోగాని ఒక సిబ్బిని అల్లుతారు. దాని మీద బతుకమ్మ పేరుతో తంగేడు, గునక, పట్టుకుచ్చు, బంతి మొదలైన పువ్వుల దొంతరపై తమల పాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. తరువాత పసుపుకుంకాలతో ఆ పసుపుగౌరిని పూజించి, ఒక పీటమీద పెట్టి సాయంత్రం సమయంలో ఇంట్లోని ఆడవారందరూ చక్కగా ముస్తాబై బతుకమ్మలను చేతులతో పట్టుకొని చెరువు దగ్గరకుగాని, కాలువ దగ్గరకుగానీ, గుడి దగ్గరకు గానీ తీసుకువెళతారు. అక్కడ బతుకమ్మలను మధ్యలో పెట్టి చుట్టూ తిరుగుతూ లయాత్మకంగా అడుగులువేస్తూ ప్రదక్షిణలు చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవనరీతులు, కుటుంబ అనుబంధాలు, పురాణ గాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు.

బతుకమ్మ ఉత్సవంలో ఆటపాటలకు చాలా ప్రాధాన్యముంది. 'బతుకమ్మ ఆట' అని ఈ నృత్యానికి పేరు.

మొదటి రోజు



బతుకమ్మను – **'ఒక్కేసి పువ్వేసి చందమామ**
**ఒక్క ఝామాయె చందమామ**
**శివుడింక రాడాయె చందమామ**
**శివపూజ యాల్లాయె చందమామ''**
**అని పాడుతూ**

తొమ్మిదవ రోజున **''ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ**
**ఏమేమి కాయొప్పనే గౌరమ్మ'' అని ముగిస్తారు.**

చివరగా బతుకమ్మను నీళ్ళలో వాలాడించి ప్రసాదాలు పంచుకుని ఇళ్ళకు వెళ్తారు. ఇది గ్రామప్రజల సమైక్యతకు దోహదం చేసే చక్కని పండుగ. అందరినీ బతుకమనీ, అందరికి బ్రతుకు నివ్వమనీ కోరుకునే తెలంగాణ సాంస్కృతిక మహోత్సవం ''మన బతుకమ్మ''.

---

## I. వినండి–సంభాషించండి.

1. స్త్రీలు జరుపుకునే కొన్ని పండుగల పేర్లు చెప్పండి.
2. మీ పాఠశాలలో జాతీయపండుగలు ఎలా జరుపుతారో చర్చించండి.

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

### అ. పదజాలం పెంపొందించుకుందాం.

సంప్రదాయం = పూర్వకాలం నుంచి పాటిస్తూ వచ్చిన ఆచారం; కనువిందు = కన్నుల పండుగ; విశిష్టమైంది = శ్రేష్టమైంది, ప్రత్యేకమైంది; దొంతర = వరుస; ఆలపించుట = పాడుట; ఇతిహాసం = పూర్వ కథ; వాలాడించు = మెల్లగా వదలు.


### ఆ. చర్చించండి–రాయండి.

1. తెలంగాణాలో జరుపుకునే బతుకమ్మ పండుగకు గల వివిధ పేర్లు.
2. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యేది.
3. పండుగ సందర్భంగా ఆలపించుపాటలు.
4. సిబ్బిని అల్లు విధానం.
5. పసుపు గౌరమ్మను అలంకరించు విధం.
6. బతుకమ్మ ఆట నృత్యాల్లో పాడే పాటలును వర్ణించండి.
7. బొడ్డెమ్మ పండుగ

## III. కృత్యం:

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

### అ. బతుకమ్మను పేర్చే పువ్వులపేర్లతో ఆకృతిని పూరించండి.



"బతుకమ్మ పండుగ రోజు ............................... ఆటపాటలకు చాలా ప్రాధాన్యముంది" వరకు




**ఆ. అర్థాలు రాయండి.**

1. దొంతర = [ ]    2. ఆలపించుట = [ ]

**ఇ. స్వీయస్పందన:**

సిబ్బిని అలంకరించు విధానం మీ సొంత మాటల్లో రాయండి.

## IV. భాషావగాహన

**అ. సామాన్య, సంయుక్త వాక్యాలుగా గుర్తించి రాయండి.**

1. అనేక సంస్కృతులకు, ఆచార వ్యవహారాలకు నిలయం భారతదేశం.
2. బొడ్డెమ్మ పండుగ పిల్లలు చేసుకొనే పండుగ.
3. బతుకమ్మలను చెరువు దగ్గరకుగానీ, కాలువ దగ్గరకుగానీ, గుడి దగ్గరకుగానీ తీసుకువెళతారు.
4. ఇది గ్రామ ప్రజల సమైక్యానికి దోహదం చేసే చక్కని పండుగ.

**ఆ. సరైన ప్రత్యయాలతో పూరించి విభక్తులు రాయండి.**

1. సంప్రదాయాల ____________ అనుగుణంగా కొద్దిపాటి తేడాల ____________ జరుపుకుంటారు.
2. పసుపుకుంకాల ____________ పసుపుగౌరి ____________ పూజిస్తారు.
3. బతుకమ్మ ఉత్సవం ____________ ఆటపాటల ____________ చాలా ప్రాధాన్యముంది.

**ఇ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

- <u>బొడ్డెమ్మ</u> పండుగ సమయంలో పిల్లలందరూ <u>చక్కగా</u> ఆడుకుంటుంటే <u>వారిని</u> చూసి పెద్దలు <u>సంతోషిస్తారు.</u>

బొడ్డెమ్మ [ ]   చక్కగా [ ]   వారిని [ ]   సంతోషిస్తారు [ ]

**ఈ. వాక్యాంగాలు రాయండి.**

1. స్త్రీలు బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.
2. పెద్దలు పిల్లలను చూచి ఆనందిస్తారు.

## V. సృజనాత్మకత:

1. బతుకమ్మ తెలుగు పాటలు, ఇతర జానపద గేయాలు అంతర్జాలంలో చూసి నేర్చుకోండి.
2. వివిధ పండుగలకు సంబంధించిన చిత్రాలను సేకరించి, ఆల్బమ్ తయారు చేసి, తరగతి గదిలో ప్రదర్శించండి.

**లేఖన నైపుణ్యాలు : నివేదిక**

NLR56R

### అభ్యాసం

మీ పాఠశాలలో జరుపుకున్న వార్షికోత్సవం గురించి కింది అంశాల ఆధారంగా నివేదిక రాయండి.

- తేది: శనివారం, డిసెంబరు – 20
- పాఠశాల అలంకరణ
- ముఖ్య అతిథి : శ్రీ కపిల్ పాటిల్, పార్లమెంటు సభ్యులు
- దీప ప్రజ్వలన
- ప్రార్థన
- ముఖ్య అతిథి సందేశం
- విద్యార్థులకు బహుమతులు
- సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రధానోపాధ్యాయుని వార్షిక నివేదిక
- వందన సమర్పణ

**భాషాకౌశల్యాలు – మౌఖికం: ప్రకాశ పఠనం**

**"ఒక్కేసి పువ్వేసి చందమామ"** పాటను రాగయుక్తంగా చదవండి.

వి.సూ.: బతుకమ్మను అలంకరించే వివిధ పుష్పాలను అంతర్జాలం ద్వారా సేకరించి ఒక పట్టిక తయారుచేయండి.